# ఎన్నోరంగుల తెల్లకిరణం

## - సిరివెన్నెల సీతారామశాస్త్రి



*(సిరివెన్నెలగారు వ్రాసిన కథలు నెలకొకటి)*

**సంకల్పం**

సాహిత్యంలో 'కథ' (short story)కి సంబంధించిన నిర్వచనాలూ, నియమావళి, ఆవిర్భావం. ఆకృతి, పరిణామము, పరిణితి ఇత్యాది అంశాలపట్ల నాకు నిర్దిష్టమైన అవగాహన ఉంది - అని నేను అనుకోను. కథా సామ్రాజ్య నిర్మాతల, నిర్ణేతల సరసన నిలచి తర్కించే తాహతు నాకుందని కూడా అనుకోలేను.

'ఏం చెప్పాలి' అనే దానికన్నా 'ఎలా చెప్పాలి?' అనే అంశంపట్లే నాకు ఎక్కువ మక్కువ.

కనుక, నా కథల్లో ఇంతవరకు స్పృశించబడని, కనని, వినని అపురూపమైన 'వస్తువు' ఉందని దబాయించను.

కథా కథన విధానంలో, రసపోషణ, నిర్వహణ వగైరా సాంకేతికాంశాలపట్ల నాకున్న పరిజ్ఞానం బహు తక్కువ.

'కథ చెప్పడం' అనేది ఎప్పుడో అయిపోయింది - "with all its totality & perfection" అనేది నా నమ్మకం.

'ఎలా చెప్పడం' అనేది ఎప్పటికీ అయిపోదు అనేది కూడా నా నమ్మకం.

'అతి పాత', 'మామూలు' విషయాలే ఒక్కొక్కప్పుడు నా గుండెను కొత్తగా, బలంగా 'తాకిన' అనుభూతి కలిగినప్పుడు, ఆ అనుభూతిని యథాతథంగా 'మాటల్లో'కి అనువదించడానికి నేను చేసిన ప్రయత్నాన్ని చాలామంది కథా సాంకేతిక నిపుణులు 'ఇది, ఇలాంటిది కథే కాదు పొమ్మన్నారు.'

'కాబోసు' అనుకున్నాను గాని, తెగబడి 'ఏం? ఎందుక్కాదు?' అని ఎదురు తిరిగే ప్రయత్నం చెయ్యలేదు. 'కానీలే! నాదో 'మాలోకం' అయి ఉంటుందని ఊరుకున్నాను.

నా 'మాలోకం'లో జనాభా లెక్కల సేకరణ జరిగితే, నేను గాక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఉంటారా అని తెలుసుకోవాలనే నా ఆరాటం గత ముప్పై సంవత్సరాలుగా నన్ను వెన్నంటే ఉంది.

ఆ 'రీసెర్చి'లో భాగంగా ఇలా నా 'స్వగతాలన్నీ' ఓ సంకలనంగా పోగుచేసి అన్వేషణకి పంపిస్తున్నాను.

*(సీతారామశాస్త్రి)*

## చరిత్ర చోరులు

**పదిహేను** రోజుల క్రితం ఓ అర్ధరాత్రి అక్రమంగా, అన్యాయంగా అమానుషంగా ఒక 'చలనం' జరిగింది చరిత్రలో. చలించరానిది చలించింది గనక సంచలనం చెలరేగింది. కదపకూడని దాన్ని కదిపారు గనక గొప్ప కదలిక మొదలైంది దేశంలో, కాలంలో, ఎన్నో హృదయాల్లో, మరెన్నో ఆలోచనల్లో.

కంటికి కనిపించని ఈ తుఫాను తాకిడికి అల్లల్లాడిపోతున్నాయి చరిత్రపుటలు ఈ పదిహేను రోజులుగా.

'కళాసరస్వతి కళంకితమైపోయింది' అని కేశవ్‌లోని కళాకారుడు కన్నీటితో క్రక్కడిల్లిపోతున్నాడు.

"మానవుడు తాను కూర్చున్న చెట్టుకొమ్మని తానే నరుక్కుంటున్నాడు. తన గతాన్ని తన చేతులతో తానే ధ్వంసం చేసుకుంటూ, తన భవిష్య గృహంలోని దీపాన్ని తానే ఆర్పుకుంటున్నాడు." అని చరిత్ర అశరీరవాణితో అరుస్తోంది.

పదిహేనురోజులుగా చెన్నకేశవస్వామి తన సొంత నెలవు విడిచి కోర్టువారి కొలువులో రక్షణ పొందుతున్నాడు. ఈ పదిహేనురోజులుగా చెన్నకేశవస్వామికి నివాళిలేదు. నీరాజనం లేదు. నైవేద్యం లేదు. నిత్యస్నానం లేదు. నిరంతరభోగం లేదు. చరిత్రకు తెలిసినంతవరకూ చెన్నకేశవస్వామికి ఈ దురవస్థ ఎప్పుడూ లేదు.

నిశ్చల ధ్యానముద్రలో కూర్చుని, నిర్మతర భక్తి వాహినిలో కదిలిపోతున్నారు తిరుమలాచార్యులుగారు.

బెయిల్‌మీద విడుదలైన చిన్న దొరకి ఈ పదిహేనురోజులుగా అప్పుడప్పుడు కోర్టుకి వెళ్ళిరావడం వినా, నిత్యకృత్యంలో పెద్ద డిస్టర్బెన్స్ లేదు.

లాయర్ సూర్యారావు ఈ పదిహేను రోజులనుంచీ ప్రతిరోజూ నూనెకు బదులు ఈ కేసునే తలకి పట్టించుకుంటున్నాడు.

కాటంరాజుగారు ఈ ట్రిపుల్ హెడేక్‌ని సూర్యారావుకి పంపిణీచేసి తన కార్యక్రమాల్లో మునిగిపోయారు నిశ్చింతగా.

ఈ విధంగా ఇంతమందిని ఇన్నాళ్ళుగా 'మూవ్' చేస్తోన్న ఈ తుఫాను తాకిడికి ఒక గడ్డిపరక కూడా అటూఇటూ కదుల్తోంది. కోర్టునుంచి రిమాండుకీ, రిమాండునుంచి కోర్టుకీ. ఆ గడ్డిపరక పేరు పైడికొండ. తాము తూలిపోకుండా బ్యాలన్స్ సరిచూసుకోవడంలో తీవ్రమై వున్న మహావృక్షాలు ఈ తృణచలనాన్ని పట్టించుకోకపోవడం సహజమే! కానీ ఎప్పుడూ భగవంతుడి పాదపద్మాల మీద మాత్రమే దృష్టి కేంద్రీకరించుకుని, వినయంతో శిరస్సు వంచుకుని క్రిందకి మాత్రమే చూసే తిరుమలాచార్యుల వారికొక్కరికి మాత్రం ఈ 'తృణ చలనం' కంటబడింది.

అతి ప్రాచీనమైన ఆ చెన్నకేశవస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందిన కళానివాసం. విశాలమైన ప్రాంగణం. ఎన్నెన్నో మంటపాలు, ప్రాకారాలు. ప్రతి అంగుళం పరమాద్భుతమైన శిల్పకళా వైభవంతో విరాజిల్లుతూ ఉంటుంది.

నాట్యాన్ని స్థిరీకరించిన ఆ శిల్పాలు చూపరుల హృదయాన్ని నర్తింపజేస్తాయి.

అక్కడి అణువణువునా ఉప్పొంగి పొర్లుతున్న కళాఝురి సందర్శనార్థం వచ్చినవారిని నిశ్చలం చేస్తుంది. శిల్పాలుగా మార్చి నిలబెట్టేస్తుంది. అక్కడ కదలాడిన ఉలి మానవుని కలలన్నిటినీ శిలల్లో కట్టి అట్టేపెట్టింది.

చెరిగిపోని, కదలిపోని ఆ స్వప్న స్వర్గం - స్వర్గ స్వప్నం ఏనాటిది?

ఈ ప్రశ్నకు జవాబు చెప్పాలని చరిత్ర గింజుకుంటోంది. శాతవాహనులనీ, చోళులనీ, పల్లవులనీ, కాకతీయులనీ, వీరందరికీ పూర్వులైన ఇంకెవ్వరో అనీ ఈ సృష్టి కర్తృత్వాన్ని ఎవరో ఒకరికి ఆపాదించాలని ఆరాటపడుతోంది.

అవిచ్ఛిన్నంగా కొనసాగుతోన్న ఈ కళాసామ్రాజ్యం మీదికి దండయాత్ర జరిగింది.

ఆ మధ్య సీమనుంచి ఓ దొరగారు దిగారు. ఆయన ఓ పెద్ద కళాపిపాసి. ఇక్కడి కళాకాంతను వరించారు. చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించి వచ్చి కాటంరాజుగారితో కాంట్రాక్టు కుదురుకుని వెళ్ళారు.

కాటంరాజుగారు బిల్డింగ్స్ కాంట్రాక్టరు. ఏదైనా కట్టడం యొక్క నిర్మాణంగాని, నిర్మూలనంగాని ఆయనతో ఎదుటి పార్టీ చేసుకునే ఒప్పందం బట్టి వుంటుంది. తన పూర్వపు కాంట్రాక్టర్లెందరో కట్టిపడేసిన కళాకాంతను తాను విడిపించి తెచ్చి, కన్యాదాతగా వ్యవహరించి,

సీమదొరగారికి కట్టబెట్టి, మెట్టినింటికి సాగనంపాలి. ఆ మేరకు ఒప్పందం కుదుర్చుకుని కాటంరాజుగారు కార్యనిర్వహణకు, కుడిభుజం చిన్నదొరకు కబురు పెట్టారు.

"మనవాళ్ళకు గొప్ప కళను సృష్టించడం తెలుసుగాని, గౌరవించడం తెలియదు సుమీ! ఇంత గొప్ప చెన్నకేశవస్వామి విగ్రహాన్ని అలా చీకట్లో, చిన్న కొట్లో పెట్టి దీపం - ధూపం అంటూ పొగపెట్టి, పాలూ, నీళ్ళూ, పూలు, పాపాలూ నెత్తిన గుమ్మరించి పాడుచేస్తున్నారు. కళ్ళారా కళను చూసి, 'ఔరా!' అని ఆనందించడం మాని భక్తిపేరుతో కళ్ళని గట్టిగా మూసేసుకుంటూరేంటీ? అబ్బెబ్బే! బాగులేదు. ఈ కళాఖండాల్ని సరైన సౌందర్యారాధకుడి కొలువులో అలంకరించాలి. ఆ ఏర్పాటు చెయ్యి. అన్నట్లు చెన్నకేశవస్వామిని ఒంటరిగా పంపడం ఎందుకూ? వీణలు వాయిస్తూ వేణువులూదుతూ, నాట్యం చేస్తూ ఆ మారుమూల గోడల కంటుకుపోయిన కళాకారుల్ని కూడా ఆయనతో పంపు. దారిలో కాలక్షేపంగా వుంటుంది.

ఆయన వెళ్ళేది పశ్చిమ దేశాలకి కదా! అక్కడ మళ్ళీ ఆయనకి మన చెట్లూ, లతలూ, పూలూ, పళ్ళూ, పిట్టలూ, జంతువులూ కనిపిస్తాయో, కనిపించవో! ఎలాగా మనవాళ్ళు ఇవన్నీ స్థంభాల మీద చెక్కి అట్టేబెట్టారు కదా! పోర్టబుల్‌గా మార్చగలవేమో చూడు!"

చిన్నదొర కార్యాచరణానికి పూనుకున్నాడు. మొట్టమొదట కావలసింది కార్మికులు. పైడికొండ దగ్గరకు వెళ్ళాడు.

గుండెనీ, మెదడునీ కూడా కండలుగానే మార్చి సృష్టించాడు పైడికొండని భగవంతుడు.

పైడికొండకి రెండే వున్నాయి. కడుపూ - కండలూ. ఇంట్లో పెళ్ళాం, పిల్లల కడుపులు కూడా అతని కండల్నే తింటూ వుంటాయి. కండల్ని తిండిగా మార్చగల ఏ పనైనా చేస్తాడు పైడికొండ. అతనికి విచక్షణ అనేది తను పొందే కిరాయి మీద ఆధారపడి వుంటుంది.

కోతల సమయంలో పంటలు కోసి కుప్పలు వేసే కూలిపని చేస్తాడు. ఊడ్పుల సమయంలో నారుపోసి, నీరుపోసే కూలిపని చేస్తాడు. కలుపు తీసేందుకు, కంచె వేసేందుకు పనికొస్తాడు.

కుప్పల యజమానుల రక్షణ కోసం నూర్చిన కుప్పల్ని తగలబెట్టే 'కూలిపని' కూడా చేస్తాడు. తన చేతులతో నారుపోసి, నీరుపోసి, కలుపు తీసి, కంచె వేసి, పెంచి పెద్దచేసి పండించిన పంటను తన చేతులతోనే చితిలో వెయ్యడానికి వెనుకాడడు పైడికొండ. కిరాయిలో మాత్రం నిర్మాణానికీ, నిర్మూలనకీ తేడా చూపిస్తాడు. అతని చెమట పగటి తాపంలో తక్కువ కిరాయికీ, చీకటి పాపంలో ఎక్కువ కిరాయికీ స్రవిస్తుంది. ఇలా ఎక్కువగా పుచ్చుకుని చట్టానికీ, న్యాయానికీ ఋణపడిపోతే అడపాదడపా కటకటాల వెనకాల శ్రమించి, ఋణవిముక్తుడు అవుతుంటాడు.

కాటంరాజుగారు తన కాంట్రాక్టుల కోసం ప్రత్యేకంగా ఒక కూలీల దళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అందులో పైడికొండ ఒకడు.

చిన్నదొర పైడికొండని వెతుక్కుంటూ వచ్చే సమయానికి పైడికొండ సూర్యుడి పర్యవేక్షణలో చెమటలు కక్కుతూ పగటి పని చేస్తున్నాడు. ఏదో భవన నిర్మాణం జరుగుతోంది. కడుతోన్న గోడకోసం ఇటుకలు మోస్తున్నాడు పైడికొండ. నిర్మాణం అందంగానూ, తీరిగ్గానూ జరుగుతోంది.

చిన్నదొర పైడికొండతో మంతనాలాడాడు. మరో ఇద్దరు - కోటిరెడ్డి, గంగులూ దొరికారు. చాలు.

మర్నాడు రాత్రి పైడికొండ దేవాలయపు గోడల నుండి రాళ్ళను పెకిలిస్తున్నాడు. ప్రతిమల్ని సాధ్యమైనంత సాకారంగా విడిగొట్టడానికి. చీకటిలాంటి చిన్నదొర పర్యవేక్షిస్తున్నాడు. నిర్మూలనం శీఘ్రంగానూ, వికృతంగాను ముగిసింది.

వాహనం సిద్ధమైంది. కోటిరెడ్డి పనైంది. కిరాయి పుచ్చుకుని వెళ్ళిపోయాడు. గంగులు డ్రైవ్ చేస్తున్నాడు. పైడికొండ చెన్నకేశవస్వామికీ, ఆయన పరివారానికీ కంపెనీ ఇస్తున్నాడు.

మార్గమధ్యంలో -

దొరగారిదాకా కళాకాంతని సాగనంపాల్సిన పైడికొండతో రూటుమార్చి తన అత్తారింటికీ, చట్టవిరుద్ధమైన గౌరవం పొందడానికి పోతోన్న చెన్నకేశవుడు చట్టబద్ధమైన గౌరవంలోకీ, అసౌకర్యంలోకీ తరలిపోయారు.

గంగులు కొంతకాలంపాటు పరారి మంత్రం సాధన చెయ్యడానికి అడవుల్లోకి వెళ్ళాడు.

కంచికి చేరాల్సిన కథ, 'కంచె' కాపుకాసి అడ్డుకోవడం వల్ల ఇంటికి తిరిగిచ్చేసింది.

కేశవ్ తన గదిలో కూర్చుని చకచకా రాసుకుపోతున్నాడు. తన వ్యాపారాన్ని 'పర్వతాగ్రం నుంచి పాతాళపు లోతుల్లోకి' అనే శీర్షిక క్రింద.

"ఇన్ని దోపిడీలు, ఇన్ని దురంతాలు, ఇంత అశాంతి, ఇంత అభద్రత... మనిషికి వర్తమానం ఇంత పీడకలలా పరిణమించిందేమిటి? ఇందుకేనా మనిషి ప్రకృతినుంచి వేరుపడిపోయాడు? సమాజంగా ఏర్పడి, నాగరికుడుగా ఎదిగింది ఇలాంటి వర్తమానంలోకి ప్రయాణించడానికేనా?"

"ఆహారం సమస్య! నిద్ర సమస్య! భయం సమస్య! మైథునం మహా సమస్య."

"ఇంక, ప్రకృతి నుంచి వేరుపడి మనిషి సాధించిందేమిటి? జీవితాన్ని సమస్యగా చేసుకోవడం తప్ప?"

రాస్తూ రాస్తూ అలసిపోయి అలాగే నిద్రపోయాడు. ఉషోదయంతో లేచి, దేవాలయం వైపు వెళ్ళాడు.

అతని జీవితమంతా ఆ దేవాలయం ప్రాంగణంలో నిర్మితమైంది. ఆ కోనేటి నీరు తన నెత్తురుగా, ఆ చెట్ల చిరుగాలులు తన ఊపిరిగా పెరిగాడు కేశవ్. అక్కడి చిరుగంటల సవ్వడి అతని గళంలో తరంగిస్తూ అతన్ని గాయకుణ్ణి చేసింది.

ఆ శిల్పాలు అతనిలోని కవిని చెక్కిన శిల్పాలు. అక్కడి కళాకాంత అతనిలోని కళాకారుణ్ణి కన్నది. ఆ ప్రాకారాల్లోని ప్రతిమల పాదాలు నిరంతరం అతని హృదయ వేదిక మీద నర్తిస్తూ ఉంటాయి.

ఆ రోజు అక్కడ అతను చూసిన దృశ్యం...

కదనరంగంగా మారిన కళాదర్బారు. కుత్తుక ఉత్తరించిన కళాసరస్వతి కళేబరం కనిపించింది. నిన్నటి నిశిలో అక్కడ నర్తించిన పిశాచాల వికటహాసపు వికృతస్మృతి.

కుసుమ కోమలమైన కళాకన్య పాదాలు నర్తించే ఆ ప్రాంగణంలో రక్షకభటులు కాళ్ళు కవాతు చేస్తున్నాయి. చిరుగజ్జెల ఘలంఘలలో మృదంగించిన మంటపాలు ఇనుప నాడాల తోలుబూట్ల ఘట్టనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. వేణువులు వినిపించే కచేరీలో పోలీస్ విజిల్స్ అరుస్తున్నాయి.

కొన్ని స్థంభాల్ని పెరికేశారు. మరికొందరు కళాకారుల చేతుల్ని వీణలు, వేణువులతోసహా నరికేశారు. కొన్ని తనూలతల్ని తెంపేశారు. కొన్ని లతల తనువుల్ని కోసేశారు. మొత్తం అన్ని ప్రతిమల్నీ చెరిచారు. అవి రాళ్ళేగా! అక్కడ రక్తం ప్రవహించదుగా! ఈ ప్రశ్నల్ని మరుభూమిలా మిగిలిన ఆ ప్రాంగణాన్ని కాదు అడగవలసింది. కేశవ్‌లాంటి కళాకారుల గుండెల్ని అడగాలి. ఎందుకంటే రాతిమీద మూర్తిని మాత్రమే చెక్కిన ఉలి, ఆ మూర్తి ప్రాణాల్ని కళాకారుల హృదయాల్లో నిక్షిప్తం చేసింది.

"ఎలా జరిగింది?"

ఈ ప్రశ్న ఎవ్వరినీ వేయడు కేశవ్. జవాబు ఎదురుగా కనిపిస్తోంది గనుక.

"ఎవరు చేయించారిది?"

ఈ ప్రశ్నా వేయడు కేశవ్. స్మగ్లర్స్. ఈ 'జాతినామం' ఆ ప్రశ్నకి జవాబని అతనికి తెలుసు. ఆ ఇంటిపేరు గలవారి వంశం ఇటీవల విస్తరిస్తోంది. వ్యక్తినామస్మరణ మర్నాడు వార్తాపత్రిక జపించింది. స్మగ్లర్ కాటంరాజు. స్మగ్లర్ చిన్నదొర.

చరిత్ర ఈ రెండు పేర్లనీ నోట్ చేసుకుంది.

"ఎవరు చేసారిది?"

ఈ ప్రశ్న అసలు కేశవ్ ఆలోచనల్లోకే రాదు. ఆ ప్రశ్నకు జవాబుగా ఒప్పుకోవలసిన వారి వంశనామం ఈ దేశమంత పెద్దది. ఈ దేశమంత పెదవి కూడా. 'కిరాయి' అనేదే వారి వంశనామం. చరిత్ర కిరాయివారి పేరు రాసుకోలేదు. కాటంరాజు చిన్నదొరల పేర్లు మాత్రమే రాసుకుంది.

కేశవ్ తిరుమలాచార్యుల వారింటివైపు బయలుదేరాడు. గాయపడ్డ అతని హృదయానికి సానుభూతి కావాలి. అతని దుఃఖాన్ని పంచుకోగలిగేది ఆచార్యుల వారొక్కరే. అర్చకులుగా ఆ ఆలయాన్ని అంటిపెట్టుకుని ఆయన గర్భగుడిలో చెన్నకేశవస్వామికి జీవితాన్ని అర్పించుకున్నారు. కేశవ్ కళారాధనతోనూ, ఆచార్యులు భక్తిపారవశ్యంతోనూ సేవించారు ఆ ఆలయాన్ని. ఆ విధంగా వారిద్దరూ సహోదరులు. ఇద్దరికీ ఒకే దెబ్బ, ఇద్దరికీ ఒకే బాధ.

తిరుమలాచార్యుల వారిని చుసి కొంత ఆశ్చర్యపోయాడు కేశవ్. ఆయనలో ఉండవలసినంత దుఃఖం ఉన్నట్లుగా తోచలేదతనికి. నిర్లిప్తంగా ఉన్నారు.

ఇద్దరి మధ్యా చాలాసేపు మౌనం. ఆ తరువాత కేశవ్ తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు.

ఆయన నవ్వి అన్నారు. "ఏ ఆలయానికైనా స్థల మహత్యం కొంతకాలం వరకూ పరిమితమై ఉంటుంది. దైవాన్ని ప్రతిష్టించే ముందు శ్రీ చక్ర యంత్రం స్థాపిస్తారు. వాటిలో ఆలయ ప్రాశస్త్య కాలపరిమితి నిర్దేశించి వుంటుంది. నా చెన్నకేశవుడికి ఇక ఇక్కడ కొలువు వుండవలసిన అవసరం లేదు. ఈ స్థలానికి ఆయున్ను నిలుపుకోగలిగిని మహత్మ్యం చెల్లిపోయి వుంటుంది. ఆయన అవతారం చాలించి వెళ్ళిన వెనకనే నరులు ఆ విగ్రహాన్ని తాకగలిగి ఉంటారు. ఒట్టి రాతి విగ్రహాన్ని కదపటంలో కష్టమేముందీ? నా స్వామి ఇంకా ఇక్కడే వుండనిశ్చయించుకుంటే, నరులు తేరిచూడగలరా? ఈ పాటికి మరో పవిత్రమైన స్థలంలో వెలసేవుంటాడు. అదీగాక.. "ఆయన తన నమ్మకాన్ని ఇంకా వివరిస్తూండగా కేశవ్ మధ్యలో అందుకున్నాడు. "చెన్నకేశవస్వామి ఒక్కటే సమస్యా ఇక్కడ? భక్తిపట్ల తప్ప మరో వైపు మీ దృష్టి మళ్ళదా?

"లేకేం? చాలా ముఖ్యమైనదీ, ప్రాథమికమైనదీ అయిన సమస్య ఉన్నది. అదేమిటో నేను తరువాత చెబుతాను. ముందు నీ ఆవేదన దేనికోసమో స్పష్టం చెయ్యి. ఆగు! కళాకారుడిగా నీ హృదయానికి తగిలిన గాయాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ, కళాకారుడిగా కాక, ఒక మామూలు మనిషిగా ఆలోచిస్తూ, ఈ సంఘటనలో కళావిధ్వంసం తప్ప మరేదైనా సమస్య వున్నదేమో చెప్పు."

"ఎందుకు లేదు? చాలా భయంకరమైన సమస్య. మానవుడి చరిత్రకీ భవితవ్యానికీ ఆధారభూతమైన గతం నాశనమైంది. ఈ దేవాలయం భక్తికీ, కళకీ మాత్రమే ప్రతినిధి కాదు. మానవుడి జీవితానికీ, జీవనానికీ గతం నుంచి భవితవ్యం దాకా సాక్షీభూతంగా నిలిచే చరిత్ర ఇది" చాలా ఆవేశంగా అన్నాడు కేశవ్.

"అసలు చరిత్ర ఎందుకు కేశవ్?" చాలా ప్రశాంతంగా అడిగారీ ప్రశ్నని తిరుమలాచార్యులుగారు.

చకితుడైన కేశవ్ అయోమయంగా "అంటే?" అన్నాడు.

"అంటే, గతం ఎవరికి, ఎందుకు, ఏం అవసరం అని."

"మీరీ ప్రశ్నని ఎలా వేయగలుగుతున్నారో, ఎందుకు వేస్తున్నారో అర్థంకావడం లేదు. మనిషికి గతం అక్కర్లేదా? గతం దారి తియ్యకపోతే మనిషి భవిష్యత్తుని ఏ పునాది మీద నిలబెడతాడు?" ఆవేశంతో ఊగిపోతూ అరిచాడు కేశవ్.

"కేశవ్ మనిషి, మనిషి అని నువ్వు పదేపదే వర్ణిస్తూన్న మనిషి వేరు, నిజమైన మనుషులు వేరు. నువ్వూ, నీ చరిత్రా ఆరాటపడేది నిజమైన మనుషుల గురించి కాదు. మనుషులుగానే పుట్టినా మనుషులుగా మిగలని మరెవ్వరి గురించో చరిత్ర ఆమరెవ్వరికో సంబంధించినది. నిజమైన మనుషులకి చరిత్రేలేదు. వాళ్ళకి గతమూలేదు, అనాగతమూ లేదు"

"స్పష్టంగా చెప్పండి" ఉక్రోషంగా అన్నాడు కేశవ్.

"ఇందాకే అన్నావే - ఈ సంఘటనలో దుఃఖించవలసిన ప్రాథమిక సమస్య వున్నది అని. ఆ సమస్య చరిత్ర విధ్వంసం కావడం కాదు. కోటిరెడ్డి, గంగులు, పైడికొండలాంటి మనుషులకి చరిత్రలో ఉనికి లేకపోవడం"

"వీళ్ళెవళ్ళు?"

"చూశావా! ఎన్నాళ్ళు అసలు సమస్యకి ఆధారభూతమో, ఎవళ్ళ గురించి మానవుడూ, మానవత్వమూ ఆలోచించాలో వాళ్ళసలు నీ ఆలోచనా పరిధిలోనే లేరు. నువ్వేకాదు, నీ చరిత్రా అంతే. నేలవిడిచి సాము చేస్తుంది. వీళ్ళు మనుషులు వీళ్ళే మనుషులంటే ఈ వినాశనానికి ప్రత్యక్షకారకులు వీళ్ళు."

"మరి కాటంరాజూ?"

"వాళ్ళు చేయించిన వాళ్ళు. స్మగ్లర్స్. వాళ్ళు మనుషులు కారు. కానీ, చరిత్ర వాళ్ళ పేర్లు రాసుకుంది. అసలు 'మనుషుల్ని' వదిలేసింది. "

"కానీ, మీ మనుషులకేం ప్రమాదం లేదుగా ఇప్పుడు? కోర్టు స్మగ్లర్లను శిక్షిస్తుంది కానీ, ఆ కిరాయి వాళ్ళని కాదుగా! ఒకవేళ శిక్షించినా ఏ ఒకటి రెండు నెలల సామాన్యమైన శిక్షవేసి వదిలేస్తారుగా!" వ్యంగ్యంగా అన్నాడు కేశవ్.

"కేశవ్! ఈ శిల్పాల్ని ఇలా తరలించడం వల్ల లక్షల లెక్కలో లబ్ధిపొందేది మరెవరైనా, స్వయంగా ఈ పనిచేసినవాడు కేవలం 'కూలి'కోసం చేశాడు." స్వహస్తాలతో ఈ శిల్పాల్ని కూలగొడుతున్నప్పుడు పైడికొండకి తను చేస్తున్న 'పని' యొక్క గాంభీర్యమూ, లోతూ, పరమార్థమూ తెలియవు.

"అవసరార్థం కట్టడానికి రాళ్ళుమోసాడు వాడు. అవసరార్థం కూలగొట్టడానికి రాళ్ళు తీసాడు వీడు. ఆ అవసరం వర్తమానం. ఈ రెండు పనులూ వర్తమాన దృష్టిలో ఒకటే!"

"సామాన్యుడికి గతం, అనాగతం ఉండవు. వాడెప్పుడూ వర్తమానంలోనే వలయిస్తాడు ఆదిమజాతి అటవిక యుగంలోనూ, ఆధునిక జాతి అణుయుగంలోనూ సామాన్యుడి స్థితీ, గతీ వర్తమానమే - ప్రకృతిలోని ఇతర జంతుజాలంలాగా. "

"చరిత్రలో సామాన్యుడికి స్థానం లేదు. చరిత్ర ప్రత్యేకంగా వేలెత్తి, పేరుపెట్టి చూపించేది మామూలు మనుషుల్ని కాదు. అటు ఉన్నతులూ, ఇటు నీచులూ, అటు దేవతలూ, ఇటు రాక్షసులూ, అటు రాముడూ, ఇటు రావణుడూ, బలవంతులూ ధనసంపన్నులూ, గుణసంపన్నులూ, మేధసంపన్నులూ, అసాధారణ ప్రజ్ఞాపాటవాలగలవారూ, కళాకారులూ, రాజులూ, నేతలూ, దాతలూ వీళ్ళ గురించీ, ఇలా ప్రత్యేక లక్షణాలు గలవారి గురించీ, వీళ్ళ గతానుగతిక జీవితాన్ని గురించీ చెబుతుంది చరిత్ర. వీరంతా సామాన్య జనం కారుకదా! మరి వీరి చరిత్ర జనం చరిత్ర ఎలా అవుతుంది? "

"ఇవాళ జరిగిన ఆ సంఘటనలో ఆ స్మగ్లర్లు అనే 'రాక్షసుల' పేర్లుగాక, ఈ పైడికొండ, గంగులు అనే 'మనుషుల' వైపు చరిత్ర దృష్టి కేంద్రీకరిస్తే? "

'ఒకసారి మానవుడికి తనదీ అంటూ ఒక చరిత్ర ఏర్పడితే, అటువైపు అభివృద్ధి కోసమో, ఆదర్శం కోసమో అసాధారణుల చరిత్ర చదువుకోవచ్చు.

"నీ సంగతే ఆలోచించు. కవివి, గాయకుడివి, గొప్ప కళాకారుడివి. వీటన్నింటినీమించి ఆలోచనా శీలివి అయిన నువ్వు - ఇవన్నీ కావడానికి ముందు ప్రాథమికంగా మనిషివి కదా? కానీ నువ్వు ఈ సంఘటనవల్ల ఆ నీ ప్రప్రథమ స్థితికి కలిగిన నష్టంపట్లా, అక్కడున్న ఆకలీ, అజ్ఞానం, అవిద్యా, పశుత్వం, అభద్రతా, అస్థిరతాలాంటి అంధకారంపట్ల కన్నా, నీ ఉన్నత ప్రమాణాలకు కలిగిన గ్లాని గురించి ఎక్కువ వ్యథ చెందుతున్నావు. అంటే నువ్వు నీ మానవత్వాన్ని ఎక్కడ వదిలేసినట్లు?

"నిజానికి ఈనాడు ఈ నీ వున్నత విలువుల ఏమీ నశించిపోలేదే ఈ దేశంలో కాకపోతే మరే దేశంలో అవి భద్రపరచబడ్డాయి? కానీ తన భవిష్యత్తుని మాత్రం నీ అలక్ష్యానికి బలిచేస్తూ అంధకారంలో అంతరించిపోతున్న గంగులు వర్తమానం నిన్ను కదిలించదేం? వాడి గతం పట్ల, వాడి భవితవ్యంపట్ల నీ ఆవేదన ఏదీ?

"జైల్లో నిశ్చింతగా కాలిమీద కాలు వేసుకుని పడుకుని, ఈ పనివల్ల తను చట్టానికి ఋణం తీర్చుకోగా, ఎంత గిట్టుబాటు అవుతుందో లెక్కలు కట్టుకుంటున్న పైడికొండ - తన స్థితి ఏమిటో, మానవుడిగా తన గతిఏమిటో, తనకు కావలసినదేమిటో, తను కోల్పోతున్నదేమిటో తెలుసుకోలేనంత అమాయకత్వంలో, అజ్ఞానంలో అంధకారంలో వున్నాడే నీకు చీమ కుట్టినట్లయినా అనిపించదా?"

తిరుమలాచార్యులుగారు ఇంకా చెప్పవలసినదేమైనా వుంటే దాన్ని కేశవ్ ఆలోచనలకు వదిలేస్తూ ముగించారు. కేశవ్ ఆలోచిస్తూ లేచాడు. అతని తను రాసిన వ్యాసం 'పర్వతాగ్రం నుంచి పాతాళపు లోతుల్లోకి' గుర్తుకు వచ్చింది.

పదిహేనురోజులనాటి గతం పదహారోనాటి వర్తమానంలో తారాడుతుండగా తుఫాను అలసిపోయింది. కాలక్షేపం కోసం ఊళ్ళోని సినిమా హాళ్ళని ఆశ్రయించింది.

కేసుతో బుర్రవేడెక్కిన లాయర్ సూర్యారావు, ఎవరో పార్టీ మొహమాటం మీద కాటంరాజుగారు, సరదా కోసం చిన్నదొరా, కాస్సేపు తననీ, తన ఆలోచనలన్నీ మరచిపోవడానికి కేశవ్, వీళ్ళెవరికీ తెలియని, అక్కర్లేని పైడికొండ భార్యమాలచ్చిమీ, అందరూ సినిమా హాళ్ళని ఆశ్రయించారు.

"ఏటి మాలచ్చిమీ! సినిమా కొచ్చినవా?" ఎవరో మాలచ్చిమిని పలకరించారు.

"ఊఁ"

"అయితే పైడికొండని ఇంకా వొగ్గీనేదా పోలీసోళ్ళు?"

"ఏఁవో ఎప్పుడొగ్గుతారో నాకేటి తెలుసు? అయినా ఆడికి ఇయ్యాల ఇది కొత్తేటి? మాములే. ఒత్తే నాలుగైదురోజుల్లోనో, కాకపోతే నాలుగైదు నెలల్లోనే ఒత్తాడు" అంటూ నేల క్లాసులో నిలబడింది మాలచ్చిమి. సాయంత్రం ఆరవుతుంది. అన్ని హాళ్ళలోనూ సినిమాలు ప్రారంభం అయ్యాయి. న్యూస్‌రీలు వేస్తున్నారు. అన్ని హాళ్ళలోనూ అదే న్యూస్ రీల్. ఆ న్యూస్‌రీల్ చూస్తూనే "సొర్గానికెళ్ళినా సయితిపోరు తప్పనేదు" అని మా లచ్చిమీ, "లైఫ్ ఈజ్ నథింగ్ బట్ ఐరినికల్ కో ఇన్సిడెన్స్" అని తదితరులూ చెల్లించిన టిక్కెట్టుకు అనుగుణమైన భాషలో ఉలిక్కిపడ్డారు.

ఫిల్మ్ డివిజన్ వారు 'కళాచోరులు' అన్న పేరుతో తీసిన హ్రస్వచిత్రం అది. దేశంలోని మ్యూజియాల నుంచీ, దేవాలయాల నుంచీ శిలావిగ్రహాలూ, కళాఖండాలూ ఎలా మాయమవుతున్నాయో తెలియజేసే ఆ చిత్రాన్ని కాటంరాజుగారు చూస్తున్నారు ఆసక్తిగా. తనకు గురువులవంటి బడా స్మగ్లర్ల కౌశలాన్ని గమనిస్తూ చిన్నదొర చూస్తున్నాడు పట్టుకోగలిగినప్పుడు చట్టం ఏయే కారణాలవల్ల, ఏయే పద్ధతుల్లో పట్టుకుంటుందో పరిశీలిస్తూ.

లాయర్ సూర్యారావు కేసుని మననం చేసుకుంటూ చూస్తున్నాడు. కేశవ్ చూస్తున్నాడు - మౌనంగా ధ్యానంతో.

మాలచ్చిమి చిరాగ్గా చూస్తూ పక్కనున్న మనిషితో అంటోంది. "ఇదేమిటమ్మిదీ? చ చ చెండాలం. అసలు బొమ్మ ఎంతకీ ఎయ్యిడేటీ? సంపేస్తున్నాడు ఎదవరాళ్ళూ, రప్పలతోటి. "

వ్యాఖ్యాత గంభీరకంఠంతో విషాదాన్ని ధ్వనింపజేస్తూ ముగింపు వాక్యాలు అన్నాడు. "ఈ కళాచోరులు అమూల్యమైన కళాఖండాల్నే కాదు ఈ దేశచరిత్రనే దొంగిలిస్తున్నారు. ఇదిలా కొనసాగితే కొన్నాళ్ళకి మనకి గతమే మిగలకుండా పోవచ్చు.

మానవులంతా ఆలోచించవలసిన తరుణం ఇది. తన గతాన్ని కాపాడుకోవల్సిన బాధ్యతని ప్రతి ఒక్కరూ గుర్తించాలి"

న్యూస్‌రీల్ అయిపోయింది. కేశవ్ కళ్ళముందు తానంతవరకూ ఎరుగని పైడికొండ కదిలాడు. అతను ఏదో అంటున్నట్టు అనిపిస్తోంది.

కేశవ్ రాసుకుపోతున్నాడు.

"చెన్నకేశవస్వామి మానవుడు కాదు - దేవుడు. ఆయనకు స్థానభ్రంశం కలిగినా చరిత్రే! పునః ప్రతిష్ఠ జరిగినా చరిత్రే! నిత్యభోగం కొనసాగినా చరిత్రే. వేరేచోట, ఏ విదేశాల్లోనో, ఏ మ్యూజియంలోనో, ఏ కళాప్రియుడి గాజు హృదయంలోనో కొలువు తీరినా చరిత్రే! ఆయన భవితవ్యానికి ఢోకా లేదు. ఎక్కడికి వెళ్ళినా తనతోపాటు తన గతాన్ని తీసుకువెళ్ళగలడు. అనాద్యుడు గనక. ఎక్కడ వున్నా నిరంతర భవితవ్యం ఏర్పాటుచేసుకోగలడు బలవంతుడు గనుక.

"కాటంరాజూ, చిన్నదొరా, సూర్యారావూ కూడా మాములు మనుషులు కారు. దేవుడు వాళ్ళ నొసటి మీద మనిషి రాతరాసి పుట్టించినా, వాళ్ళు వేరే రంగురంగుల పచ్చకాగితాల మీద తమ రాతలు రాసుకున్నారు. చెడుగానైనా చరిత్రలో వీరికి చోటు వుంటుంది. "చెక్కిన శిల్పులూ, చెక్కబడిన శిల్పాలూ కూడా మనుషులు కారు. కళ కళాకారులు కళాసరస్వతి. కనుక వీళ్ళ గతం గురించీ, అనాగతం గురించీ చరిత్ర పట్టించుకుంటూంది.

"కానీ చరిత్రకి కాగితాలై తమ మీద మరెవరి రాతలో రాయనిస్తూన్న మనుషుల కథో చరిత్ర చేతిలో పెన్నుగా మారి, ఎవరెవరి గోత్రనామాలో లిఖిస్తూన్న మనుషుల గురించిన రాతలో ఎదిగిన మనిషి మేథ దొంగిలిస్తూంది.

"పర్వత శిఖరంగా పైకి లేచిన 'గొప్పతనం' తన మానవత్వాన్ని పాతాళంలో వదిలేస్తూంది. ప్రస్తుతం బెంగ పెట్టుకోవలసింది గతంకోసం కాదు. గతం తనకి అవసరమయ్యే స్థితికి అనాగతంలోకి తను నడిచే తరుణం వచ్చే స్థితికి. వర్తమానంలోని మానవుడు చేరుకునేదాకా తన చరిత్రని నిరంతరం దోచేస్తూ, దాచేస్తూ, తనని చరిత్రహీనుడిగా మిగులుస్తున్న దేవతల్నీ, రాక్షసుల్నీ, గొప్ప మంచివాళ్ళనీ, గొప్పచెడ్డవాళ్ళనీ, సామ్రాజ్యాధినేతల్నీ నిలదీసి 'నా మాటేమిటి?' అని సామాన్యుడు ప్రశ్నించగలిగేదాకా వర్తమానమే మనిషికి కథా వస్తువు."

Post your comments